
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY



పోలీసుల అదుపులో మరికొందరు?

- ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ప్రధాన సూత్రధారి కోసం పోలీసుల వేట



గద్వాల క్రైం, మే 23 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యవహారంలో పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు. ఇటీవలే పట్టుబడ్డ నలుగురు వ్యక్తుల బ్యాంక్ పాస్‌పుస్తకాలు పరిశీలించి వారి నుంచి డబ్బులు ఎవరికి బదిలీలు చేశారు అనే విషయాలపై పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ ఆరాతీస్తున్నారు. ఇటీవలే పట్టుబడ్డ వారిలో ఓ యువకుడికి ఐదు ఖాతాలు ఉన్నట్లు తెలిసింది. ఆ ఖాతాల నుంచి డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయి అనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఇందులో ఓ ఎస్ఐ కుమారుడు ఉండటంతో ఈ విషయాలను బయటకు పొక్కకుండా పోలీసులు జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది. గద్వాలకు చెందిన అనిల్‌కుమార్‌తో పాటు శాంతినగర్‌కు చెందిన ఈశ్వర్ ఇందులో ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించినట్లు తెలుస్తోంది. బుధవారం ఓ పార్టీకి చెందిన కార్యకర్తను కూడా పోలీసులు విచారించినట్లు సమాచారం. ఈ కార్యకర్తను విచారిస్తున్న సమయంలో ఓ పార్టీ నాయకుడు చూసీ చూడనట్లు వదిలివేయాలని పోలీసులకు చెప్పినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఏది ఏమైనా ఓ ఎస్ఐ కుమారుడు ఇందులో ఉండటంతో సమాచారాన్ని పోలీసులు బయటకు చెప్పకుండా జాగ్రత్తలు పడుతున్నట్లు తెలుస్తోంది.

రెండు రోజుల క్రితం పోలీసుల అదుపులోకి తీసుకున్న నలుగురు బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు సీక్రెట్‌గా విచారిస్తున్నారు. వీరు చెప్పిన విషయాల ఆధారంగా బుధవారం మరికొందరని అదుపులోకి తీసుకొన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో చాలామంది బెట్టింగ్ రాయుళ్లు ఉన్నట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. బెట్టింగ్ సూత్రధారిగా ఉన్న అయిజ పట్టణానికి చెందిన బెట్టింగ్ రాజాను పోలీసులు పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అతను గోవాలో ఎక్కువగా ఉంటున్నట్లు తెలియడంతో అక్కడి పోలీసులకు కూడా సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు ఈ కేసులో ఉన్నవారందరిపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

జన జాతర

- ఊపందుకున్న ఉపాధి హామీ పనులు



హన్వాడలో ఓ చెరువు వద్ద ఉపాధిహామీ పనికి వచ్చిన కూలీలు

- గ్రామాల్లో గుంపులుగా తరలుతున్న కూలీలు
- ఉమ్మడి జిల్లాలో ప్రతీరోజు 2 లక్షలకు పైగానే హాజరు
- పొలాలకు ఒండ్రు మట్టి వేసుకుంటున్న రైతులు
- సారవంతం అవుతున్న ఇసుక, చౌడు భూములు

జిల్లా	గ్రామాలు	కూలీల సంఖ్య
పాలమూరు	440	47,611
గద్వాల	253	30,855
నాగర్‌కర్నూల్	461	53,449
వనపర్తి	255	37,482
నారాయణపేట	280	34,017
మొత్తం	1689	2,03,414

మహబూబ్‌నగర్, మే 23: ప్రతీ రోజూ తెల్లవారగానే ఊర్లల్లో ఉపాధి కూలీలు నెత్తిన తట్ట, చేతుల్లో పార, గునపంతో ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఉపాధి పనుల వద్ద జనజాతరను తలపిస్తోంది. కూలీలు ఇతర పనులు దొరకని పరిస్థితి ఏర్పడటంతో ఉపాధిహామీ పనులకు భారీగా తరలి వస్తున్నారు. ఇదివరకు సంబంధితశాఖ సిబ్బంది వెంటపడి బతిమాలినా పనులకు రానివారు కూడా ఇప్పుడు గుంపులు గుంపులుగా పనులకు రావడంతో మస్టర్ రాయడానికి సిబ్బంది ఇబ్బందిపడాల్సి వస్తోంది.

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 1,691 గ్రామ పంచాయతీలలో ఉపాధిహామీ పథకం అమలు చేస్తున్నారు. గురువారం ఉమ్మడి జాల్లా వ్యాప్తంగా 2,03,414 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. నెలరోజుల క్రితం ఉమ్మడి జిల్లాలో 20 నుంచి 30వేల మంది కూడా హాజరుకానిది ఇప్పుడు లక్షలు దాటుతు న్నారు. ఏ గ్రామంలో చూసినా సగటుకు వంద మందికి పైగానే పనులకు వెళుతున్నారు. కొలతల ప్రకారం పనులు చేసుకుంటే ఇదివరకు రోజుకు రూ.273 కూలి వస్తుండగా ఇటీవల రూ.303కు పెంచడంతో కూలీలు ఉత్సాహంగా పనులు చేసుకుంటున్నారు.

వేసవిలో రైతులు పొలాల్లో కంపచెట్ల తొలగింపు, ఎరువులు వేసుకోవడం చేస్తుంటారు. ఇదే సమయంలో ఉపాధిహామీ పథకంలో ఒండ్రు మట్టి పనులు నడుస్తుండటంతో రైతులు ట్రాక్టర్లు మాట్లాడుకుని తమ పొలాలలో ఒండ్రుమట్టి వేసుకుంటున్నారు. కూలీల ఖర్చులు ఉపాధి హామీ పథకం ద్వారా ఇస్తుండటంతో ట్రాక్టర్ కిరాయి రైతు పెట్టుకుని పొలాలలో ఒండ్రు వేయించుకుంటున్నారు. ఇసుక, చౌడు భూముల్లో ఒండ్రు మట్టి వేసుకుంటే నేల సారవంతం కావడంతో పాటు నీరు ఆదా అవుతుంది. అందుకే చాలా మంది రైతులు పోటీపడి ఒండ్రుమట్టి వేయించుకుంటున్నారు.

సారవంతం కానున్న నేలలు

ఉపాధి హామీ పథకం ద్వారా ఒండ్రు వేసుకోవడంతో చెల్క, చౌడు, ఇసుక, దుబ్బ నేలలు సారవంతం అవుతాయి. నీటి వసతి ఉన్న రైతులు మడులు ఏర్పాటు చేసుకొని వరిసాగు చేసే ప్రయత్నం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఎక్కడ బోర్లు వేసినా నీరు పుష్క లంగా లభించడంతో చెల్కలను వరిసాగు కోసం అనుకూలంగా మార్చుకున్నారు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా బోర్లలో నీరు తగ్గి యాసంగిలో చాలా పంటలు ఎండిపోయాయి. ఇప్పుడు వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తేనే అనుకున్న స్థాయిలో వరిసాగు అవుతుందనే అభిప్రా యాలు వెల్లడవుతున్నాయి. రైతులు నీటి వసతిని దృష్టిలో ఉంచుకొని సాగు చేసుకోవాలని ఎక్కువ సాగుచేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తోందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.



అనుమానాస్పదంగా

మహిళ మృతి

పెద్దకొత్తపల్లి, మే 23 : ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని మారేడుమానుదిన్నె గ్రామ శివారులో జరిగింది. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దకొత్తపల్లి మండలం దేదినేనిపల్లి గ్రామానికి చెందిన కల్మూరి మంజుల(30) నాలుగు రోజుల క్రితం భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుం బ సభ్యులు వెతకగా మారేడమానుదిన్నె గ్రామ శివారులోని ఫారెస్టు అధికారులు అడవి చుట్టూ తీసిన గుంతలో పడి మృతి చెందింది. మంజులగా గుర్తించి మృతురాలి తండ్రి పాదాల మాసయ్య గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

విద్యార్థులపై పిచ్చి కుక్క దాడి

- ఆరుగురికి తీవ్ర గాయాలు

వడ్డేపల్లి, మే 23 : జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సు గ్రామంలో గురువారం సాయంత్రం పిచ్చికుక్క దాడి చేయడంతో ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో వారు ఆడుకుంటుండగా అటుగా వెళుతున్న పిచ్చి కుక్క వారిపై దాడి చేసింది. గమనించిన స్థానికులు కుక్కను తరిమేసి, వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని విద్యార్థులు ప్రవీణ్, మస్తాన్, ఆరిఫ్, వినయ్, విజయ్, రామాంజనేయులులను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని మాజీ సర్పంచు తిమ్మప్ప కోరారు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన విద్యార్థి ప్రవీణ్

టీబీ రోగులకు నిధులు నిల్

- క్షయ రోగులకు అందని పౌష్టికాహారం డబ్బులు
- ఏడు నెలలుగా జమకాని నిధులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2021 మంది రోగులు

వనపర్తి వైద్యవిభాగం, మే 23: క్షయవ్యాధి చాపకింద నీరులా వ్యాపించి అనేక మందిని పొట్టన పెట్టుకుంటోంది. వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. క్షయ వ్యాధి దగ్గు, తుమ్ములు, ఉమ్మివేయడం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి మనిషి ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తు రోగ నిరోధక శక్తిని తగ్గిస్తుంది. వ్యాధిని అరికట్టడం కోసం ప్రభుత్వం ఎంతో శక్తివంతమైన మందులు పంపిణీ చేయడంతో పాటు పౌష్టికాహారం తీసుకునేందుకు నెలకు రూ. 500 చొప్పున రోగి అకౌంట్‌లో జమ చేస్తుంటారు. కానీ ఏడు నెలలుగా ఈ డబ్బులు జమ చేయడం లేదు.

న్యూట్రిషన్ ఇంప్లిమెంట్ కోసం...

క్షయవ్యాధి రోగులకు న్యూట్రిషన్ ఇంప్లిమెంట్ కోసం ప్రభుత్వం ప్రతీ రోగికి నెలకు రూ. 500 చొప్పున వారి అకౌంట్‌లో జమ చేస్తుంది. అంతే కాకుండా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సైతం తమ వంతు చేయూతగా స్వచ్ఛందంగా కొందరు దాతల ద్వారా పౌష్టికాహార కిట్లను కూడా అందిస్తున్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వం ఆరు మాసాల పాటు వైద్య సేవలు అందిస్తోంది. ఈ ఆరు మాసాలు మందులు వాడుతూ.. ప్రభుత్వం అందించే నగదుతో బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తారు. ఒకవేళ ఆరు నెలల్లో వ్యాధి నయం కాకపోతే మరో మూడు మాసాలు వైద్యం అందిస్తారు. వైద్యంతో పాటు పౌష్టికాహారం కోసం నగదు కూడా జమ చేసేలా పథకాన్ని అమలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వం ఏడు నెలలుగా బడ్జెట్ లేదనే సాకుతో నగదు జమ చేయడం నిలిపేసింది.

నగదు జమ ఇలా....

క్షయవ్యాధిగ్రస్తులకు నెలకు ప్రభుత్వం అందించే నగదు జమచేసే ప్రక్రియను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) అంటారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,021 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నారు. వనపర్తి జిల్లాలోని 14 మండలాల్లో ఈ ఏడాది 366 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉన్నారు. గద్వాలలో 384 మంది, నారాయణపేటలో 224 మంది, నాగర్‌కర్నూల్‌లో 430 మంది, మహబూబ్‌నగర్ జిల్లాలో 617 మంది ఉన్నారు. వారికి ప్రతీ నెల ఎండీఆర్ (మల్టీ డ్రగ్ రెసిస్టెంన్సీ) కోసం రూ. 500లు వారి అకౌంట్‌లో జమ కావాల్సి ఉంది. మూడు రకాలుగా అందిచే ఈ పథకంలో మొదటగా 0 నుంచి 84 రోజుల వ్యవధిలో రూ. 1,500 ఒకసారి, 85 రోజుల నుంచి 168 రోజుల వ్యవధిలో రెండోసారి రూ. 1,500లు జమ చేసి, 169 రోజుల నుంచి మూడో విడతగా రోగం ఎన్ని రోజులుంటే అన్ని రోజులు వారివారి అకౌంట్‌లో ప్రతీ నెల రూ. 500 చొప్పున నగదు జమ చేయాల్సి ఉంటుంది. కానీ గత ఏడాది అక్టోబరు నెల నుంచి బడ్జెట్ లేదనే సాకుతో రోగులకు నగదు అందడం లేదు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 366 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఏడు నెలలుగా నగదు కోసం ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే నగదు రోగుల ఖాతాలో జమచేయాలని కోరుతు న్నారు.



వ్యాధిగ్రస్తులకు జిల్లా కేంద్రంలో పౌష్టికాహార కిట్లు అందిస్తున్న అధికారులు (ఫైల్)

నిధులు రాగానే జమ చేస్తాం



ప్రస్తుతం క్షయవ్యాధిగ్రస్తులకు అందించే నగదు పథకం ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉంది. మన జిల్లాలో ఉన్న సమస్య కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్య. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే టీబీ వ్యాధిగ్రస్తుల అకౌంట్‌లో నగదును జమ చేస్తాం.

- డాక్టర్ శ్రీనివాసులు,
డిప్యూటీ డీఎంహెచ్‌వో,
వనపర్తి

కలకలం

- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారిన శ్రీధర్‌రెడ్డి హత్య
- మంత్రి జూపల్లి అనుచరులపై బీఆర్ఎస్ ఆరోపణలు
- వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యపై శవరాజకీయాలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ విమర్శ
- చిన్నంబావి మండలంలో ఉద్రిక్త పరిస్థితి

చిన్నంబావి, మే 23 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో జరిగిన శ్రీధర్‌రెడ్డి హత్య రాజకీయంగా కలకలం రేపింది. బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా వ్యవహారంగా మారింది. ఏకంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించేందుకు చిన్నంబావికి రాగా ఆయన వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రావడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ఇబ్బందికర పరిస్థితులు తలెత్త కుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మృతదేహంతో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా గ్రామానికి వెళ్లారు. అయితే శ్రీధర్‌రెడ్డిని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రోద్బలంతోనే ఆయన అనుచరులు హత్య చేశారని, ఇది ముమ్మాటికి రాజకీయ హత్య అని కేటీఆర్ ఆరోపించారు. చెప్పడానికి ఏమీ లేక దురలవాట్లు, ఆస్తి వివాదాలు, వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యపై కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు శవరాజకీయాలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. హత్యకు గురైన శ్రీధర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పార్టీ వ్యవహారాలను ఆయన చక్కబెట్టేవారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డికి, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులకు విభేదాలు తలెత్తాయి. గతంలో శ్రీధర్‌రెడ్డి మూలంగా సదరు కాంగ్రెస్ నాయకులు జైలుకు వెళ్లారనే ప్రచారం కూడా ఉన్నది. అయితే దీన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు ఇది రాజకీయ కక్షలతో జరిగిన హత్య అని భావిస్తుండగా మరి కొందరు ఇతర కారణాలేమైనా ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే హత్య ఉదంతాన్ని బీఆర్ఎస్ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు తగిలించారు. ఆయన, ఆయన అనుచరులే బాధ్యులని, మంత్రి బర్తరఫ్ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని నేరుగా డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లో ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి తెస్తున్నారని, ఇటీవల పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు మల్లేష్ యాదవ్ హత్యకు గురయ్యారని, ఇప్పుడు శ్రీధర్‌రెడ్డి హత్యకు గురయ్యారని, నాలుగు నెలల వ్యవధిలో ఇద్దరు బీఆర్ఎస్ నా యకులు హత్యకు గురికావడం ద్వారా కాంగ్రెస్ ప్రజా పాలన కాదు ప్రతీకార పాలన అనేది సుస్పష్టమవు తోందని ఆరోపిస్తున్నారు. మంత్రి ప్రమేయం లేకుండా ఆయన అనుచరులు ఇలాంటి ఘాతుకాలకు పాల్పడరని, అది కచ్చి తంగా రాజకీయ కక్ష అని ఆరోపించారు. అయితే హత్యకు కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలనుండగా ఈ ఉదంతం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా మారిందని చెప్పవచ్చు. ఇటీవల బీఆర్ఎస్ నేతలపై దాడులు జరుగుతున్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాల రాజు, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డీజీపీని కలిసి విన్నవించారు. ఈ క్రమంలోనే హత్య జరగడంతో పరిస్థితి కలకలంగా మారింది. అలాగే పోలీసులపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేశారు. హత్య విషయం తెలిపిన రెండు గంటల తర్వాత పోలీసులు వచ్చారని ఆరోపించారు. పోలీసులు మంత్రి జూపల్లి అండదండలతో అక్రమ కేసులు పెట్టారని ఆరోపించారు. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలపై మంత్రి జూపల్లి కూడా దీటుగా బదులిచ్చారు. దురలవాట్లు, భూతగాదాలు, ఆర్థిక లావాదేవీలతోనే శ్రీధర్‌రెడ్డి హత్య జరిగిందని, దాన్ని అడ్డం పెట్టుకొని తనపై బురద జల్లుతున్నారని విమర్శించారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను రాజకీయ హత్యగా చిత్రీకరిస్తున్నారని పేర్కొన్నారు. ఓ వైపు హత్య కు పూర్తికారణాలు తెలియాల్సి ఉందని చెబుతున్న కేటీఆరే దాన్ని రాజకీయ హత్యగా మాట్లాడటం ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోందని తప్పు పట్టారు. శవరాజకీయాలు చేయడం బీఆర్ఎస్‌కు కొత్త కాదని, ఎక్కడ శవముంటే అక్కడ గద్దలా వాలి నేరారోపణలు చేయడం సిగ్గుచేటని ధ్వజ మెత్తారు. ఇలాగే గంట్రావుపల్లిలో జరిగిన మల్లేష్ హత్యకు రాజకీయ రంగుపులిమారని, హత్యలపై నిష్పక్షపాత విచారణ జరుగుతుందని, అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఈ ఉదంతం చిన్నంబావి మండలంలో సంచలనంగా మారింది.



శ్రీధర్‌రెడ్డి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్



మృతదేహంతో ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉరి వేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య

ఊర్కొండ, మే 23: కుటుంబ కలహాలతో పాటు ఒంటరి జీవితంతో మనస్తాపం చెంది వృద్ధురాలు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మాచర్ల చంద్రమ్మ (75) బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై వీరబాబు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల చంద్రమ్మకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. వృద్ధురాలు గ్రామంలో ఒంటరిగా ఉంటుండగా, కూతుర్లు, కుమారుడు వేరు వేరు గ్రామాల్లో నివసిస్తున్నారు. గ్రామంలో ఉన్న భూమి విషయంలో కూతుర్లు, కుమారుడి మధ్య గొడవలు ప్రారంభం అయ్యాయి. దాంతో బుధవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినది. గురువారం తెల్లవారుజామున పరిసర గృహల వారు వృద్ధురాలు బయటికి రాకపోవడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నది. మృతురాలి కుమారుడు మాచర్ల అల్లాజీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.



రథం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా మదనగోపాల స్వామి రథోత్సవం

పెంట్లవెల్లి, మే 23 : నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో పురాతనమైన ఆలయంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత శ్రీమదన గోపాలస్వామి రథోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. జటప్రోల్ గ్రా మంతో పాటు మండలంలోని పెంట్లవెల్లి, గోప్లా పూర్, మంచాలకట్ట, మాధవస్వామినగర్, కొప్పునూర్ తదితర గ్రామాల నుంచి రథోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అంతకు ముందు రథం ముందు కొల్లాపూర్ రాజావారి కుటుంబ సభ్యులు ఎస్‌వీకేబీ ఆదిత్య లక్ష్మణ్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని ముందుకు లాగారు. పెంట్లవెల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా గ్రామంలోనే పురవీధుల గుండా రథోత్సవాన్ని దిగ్విజయంగా ముగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ భీంరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, నాయకులు గుర్క అంజనేయులు, నాగిరెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చిరుతను బంధించడంలో నిర్లక్ష్యమా..?

▸▸ తరచూ మూగజీవాలపై దాడి ▸▸ భయాందోళనలో ప్రజలు

ఖిల్లాఘణపురం, మే 23 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో అటవీశాఖ అధికారులు చిరుతను బంధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పర్వతాపూర్ గ్రామ శివారు సమ్మురొమ్ముల గుట్టపై మామిడిమాడకు చెందిన పాడి రైతు యాదయ్యకు చెందిన లేగ దూడపై బుధవారం చిరుత దాడి చేసి చంపింది. దూడను వెతికే క్రమంలో గుట్టపై చిరుతపులి కన్పించడంతో సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. పర్వతాపూర్, షాపూర్, గార్లబండతండా, కర్రెతండా, ఖిల్లాఘణపురం ప్రధాన రహదారిపై ఏడు నెలలుగా అక్కడక్కడా బాటసారులకు చిరుత తారస పడుతోంది. మండలంలోని వివిధ ప్రాంతాల్లో చిరుత లేగ దూడ, మేకపిల్ల, గొర్రె, అటవీ పందులపై తరచుగా దాడులు చేస్తున్నా అటవీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిరుత సంచారంతో మండలంలోని గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చిరుత సంచారం అడవిలో స్థావరాలు మారుస్తూ ఉండడంతో గతంలో పులిబోనులు ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చిరుత స్థావరాలు మార్చడంతో నిర్దిష్టంగా గుర్తించలేకపోతున్నామని, దాడి జరిగిన ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోతోందని అటవీశాఖ రేంజర్ మంజుల తెలిపారు. మండలంలో తరచుగా మూగజీవాలపై దాడులు జరుగుతున్న మాట వాస్తవమేనని అన్నారు. దాడిలో మరణించిన జీవాలకు నష్టపరిహారం చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఉన్న పులి బోనులను వేరే ప్రాంతాలకు తరలించామని, పాతవాటికి మరమ్మతు చేయించి పులి సంచార స్థలంలో ఏర్పాటు చేయనున్నట్లు అధికారి మంజుల తెలిపారు.


బోనుకు మరమ్మతులు చేస్తున్న అటవీశాఖ అధికారులు

కులాంతర వివాహాలకు

ప్రోత్సాహం కరువు

- ▸▸ జంటలకు అందని ప్రభుత్వ సాయం
- ▸▸ నాలుగేళ్లలో ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకున్న 111 జంటలు
- ▸▸ 54 జంటలకు ప్రోత్సాహం, పెండింగ్‌లో 57 దరఖాస్తులు



వనపర్తిలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 23 : కులాల మధ్య అంతరాలు తొలగి సమసమాజ స్థాపన జరగాలంటే కులాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే కులాంతర వివాహాలు చేసుకున్న ప్రేమ జంటలకు అండగా నిలిచి నగదు ప్రోత్సాహకంగా రూ.2 లక్షల 50వేలు ప్రభుత్వం అందిస్తోంది. కులాంతర వివాహం చేసుకున్న జంటలు హిందూ వివాహ చట్టం 1955 ప్రకారం కానీ లేదా ఇతర విధానాల్లో పెళ్లి చేసుకున్నట్లయితే అదే విషయాన్ని తెలియజేస్తు సంబంధిత వివాహ ధ్రువీకరణ పత్రాన్ని పొంది ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు ధ్రువీకరణ అనంతరం ప్రభుత్వం నూతన జంటలు సంయుక్తంగా తీసుకున్న బ్యాంకు అకౌంట్లో ప్రోత్సాహక నగదును జమ చేస్తుంది. కానీ నిధుల సమస్యతో ఈ ప్రోత్సాహక నగదు అందించడంలో జాప్యం నెలకొనడంతో నూతన జంటలకు ఆర్థిక ఇబ్బందులు తప్పట్లేదు.

నాలుగేళ్లలో 111 వివాహాలు

వనపర్తి జిల్లాలో గత నాలుగేళ్ల కాలంలో 111 జంటలు కులాంతర వివాహాలు చేసుకుని ఒకటయ్యాయి. షెడ్యూల్డ్ కులానికి చెందిన యువతి లేదా యువకుడిని ఇతర కులాలకు చెందిన అబ్బాయి కానీ లేదా అమ్మాయి వివాహం చేసుకుంటే అలాంటి పెళ్లిళ్లకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం రూ.2 లక్షల 50వేలు నగదును అందజేస్తుంది. ఆ నగదును కూడా మూడేళ్ల పాటు నూతన వధూవరుల జాయింట్ బ్యాంకు అకౌంట్‌లో జమ చేసి ఉంచుతారు. మూడేళ్ల అనంతరం వడ్డీతో సహా మొత్తం నగదును వారికే అందజేస్తారు. కాగా 2019 నవంబరు నుంచి ఇప్పటివరకు నాలుగేళ్ల కాలంలో జిల్లాలో 111 జంటలు కులాంతర వివాహాలు చేసుకుని ప్రభుత్వ సహాయానికి దరఖాస్తు చేసుకున్నాయి. కానీ ఈ నాలుగేళ్ల కాలంలో అప్పుడప్పుడు కొంతమందికి నగదు జమ చేస్తూ 54 జంటలకు మాత్రమే ఇప్పటివరకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందించింది. మిగతా వారికి మాత్రం ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు తప్పట్లేదు.

పెండింగ్‌లోనే 57 దరఖాస్తులు

గత నాలుగేళ్ల కాలం నుంచి ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్న 111 జంటల్లో ఇప్పటివరకు ప్రభుత్వం విడతల వారీగా 54 జంటలకు మాత్రమే నగదు ప్రోత్సాహకాన్ని అందించింది. ఇదే ఏడాది మార్చిలోను రూ.10 లక్షల నగదును నలుగురి అకౌంట్లో జమ చేసింది. ఏక మొత్తంలో నిధులు లభించకపోవడంతో వీలైనప్పుడల్లా కొంత మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తు వస్తోంది. దీంతో ఈ నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందిన జంటల కన్నా లబ్ధి పొందిన జంటలే అధికంగా ఉన్నాయి. జిల్లాలో ఇంకా 57 మంది దరఖాస్తుదారులు ప్రభుత్వం అందించే నగదు ప్రోత్సాహకం కోసం ఎదురు చూస్తున్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు వారి కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ లభించడం కష్టమే. దీంతో కొత్తగా ఒకటైన జంటలకు కొంతకాలం ఆర్థికంగా ఇబ్బందులు తప్పవు. అలాంటి వారి కోసం ప్రభుత్వమే అండగా నిలిచేందుకు పథకాలు ప్రవేశపెట్టినా సకాలంలో లబ్ధిదారులకు అందక ఇబ్బందులు తప్పట్లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిధులు రాగానే మిగతా వారికి అందిస్తాం..



నిధులు రాగానే మిగిలిపోయిన లబ్ధిదారుల ఖాతాల్లో కూడా ప్రోత్సాహక నగదును జమ చేస్తాం. గత మార్చి నెలలో నలుగురి లబ్ధిదారుల ఖాతాలో ఒక్కొక్కరికి రూ.2 లక్షల 50 వేల చొప్పున రూ.10 లక్షలు జమ చేశాం. మిగిలిపోయిన వారికి కూడా త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది.

- సుశిత, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

▸ ప్రయాణికురాలికి అందజేసిన డిపో మేనేజర్



బంగారాన్ని ప్రయాణికురాలికి అందజేస్తున్న డిపో మేనేజర్ సుభాషిణి

కల్వకుర్తి, మే 23 : ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలు ఆరు తులాల బంగారాన్ని పోగొట్టుకుంది. కండక్టర్, డ్రైవర్ నిజాయతీగా బస్సులో ఉన్న బ్యాగును పరిశీలించి డిపో మేనేజర్‌కు సమాచారమిచ్చి ప్రయాణికురాలికి అందజేసిన సంఘటన గురువారం కల్వకుర్తిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు.. కొత్తకోటకు చెందిన ప్రయాణికురాలు ఫాతిమా బుధవారం జడ్చర్ల బస్టాండ్‌లో కల్వకుర్తికి చెందిన బస్సులో ఎక్కి మహబూబ్‌నగర్‌లో దిగి వెళ్లిపోయింది. హడావిడిలో ఆమె వద్ద ఉన్న బ్యాగును బస్సులోనే మరిచిపోయి దిగి వెళ్లిపోయింది. గుర్తించిన కండక్టర్ ఫర్హానా, డ్రైవర్ కృష్ణలు అట్టి బ్యాగును జాగ్రత్తగా కల్వకుర్తి డిపోలోని డీఎం సుభాషిణికి అప్పజెప్పారు. వాళ్ల బ్యాగు పోయిందని ప్రయాణికురాలు ఫాతిమా మహబూబ్‌నగర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించింది. తాను కల్వకుర్తి బస్సులో ఎక్కానని డిపో మేనేజర్‌ను సంప్రదించారు. దీంతో బ్యాగును పరిశీలించిన డిపో మేనేజర్ బ్యాగులో ఆరు తులాల బంగారాన్ని గుర్తించి తమ వద్దే ఉందని సమాచారమందించడంతో ప్రయాణికురాలు ఊపిరి పీల్చుకుంది. గురువారం ప్రయాణికురాలికి కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి ఆరు తులాల బంగారాన్ని, బ్యాగును అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ నిజాయతీని ప్రయాణికురాలు అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ సంక్షేమ సంఘం నాయకులు ధారా సుందర్, సూపర్‌వైజర్లు ఎన్‌ఎం.నాయక్, లక్ష్మీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

పెద్దమందడి, మే 23 : భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు ఏర్పడడంతో మనస్థాపానికి గురైన భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి గ్రామానికి చెందిన ఎంట్ల అంజి(36) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 2010లో రాయిగడ్డకు చెందిన సుజాత అనే మహిళతో వివాహం కాగా, వారికి ఇద్దరు సంతానం కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో కొన్ని సంవత్సరాల నుంచి భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. తాగుడుకు బానిసైన అంజి బుధవారం గ్రామ సమీపంలోని సుదర్శన్‌రెడ్డి వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడి తల్లి నారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా లక్ష్మీనరసింహుని రథోత్సవం



లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడూరు, మే 23 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గత నాలుగు రోజులుగా అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నాల్గవ రోజు గురువారం తెల్లవారుజామున లక్ష్మీనరసింహుని రథోత్సవం అశేష జనవాహిని మధ్యలో అట్టహాసంగా కొనసాగింది. రథోత్సవాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయంత్రం లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా బండ్ల ఊరేగింపు కార్యక్రమం కొనసాగింది. శుక్రవారం ఉదయం స్వామి వారికి అభిషేకం అనంతరం అసురాలమ్మ తల్లికి బోనాల సమర్పణ అనంతరం చక్రస్నానంతో స్వామి వారి ఐదు రోజుల బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయని ఆలయ అర్చకుడు జగదీశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో బుద్ధ జయంతి



బొటానికల్ గార్డెన్‌లో బుద్ధ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

జడ్చర్ల, మే 23 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లోని బుద్ధ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గార్డెన్‌లోని బుద్ధ విగ్రహానికి స్థానిక కౌన్సిలర్ సతీష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పరిశోధక విద్యార్థి రాహుల్, రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

కల్వకుర్తిటౌన్, మే 23 : ఎలాంటి అనుమతులులేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ హనుమంతురెడ్డి అన్నారు. గురువారం తెల్లవారుజామున పట్టణంలో రెండు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను రవాణ చేస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్ల యజమానులు పట్టణానికి చెందిన యూసుఫ్, ఎల్లికల్ గ్రామానికి చెందిన కృష్ణ అనేవారిపై కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఆయన వివరించారు.

లారీ, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

వెల్దండ, మే 23 : మండల కేంద్రంలో గురువారం రాత్రి లారీ, బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. బొల్లిగుట్టతండాకు చెందిన మాజీ సర్పంచ్ వాల్యానాయక్‌తో పాటు మరో వ్యక్తి దేవేందర్‌లు ద్విచక్రవాహనంపై వస్తుండగా, ప్రధానరహదారిపై లారీ ఢీకొంది. దీంతో ఇద్దరికి గాయాలుకాగా చికిత్స నిమిత్తం స్థానిక యెన్నం ఆస్పత్రికి తరలించారు.

పిడుగు పాటుకు ఎద్దులు మృతి

మాగనూరు, మే 23 : పిడుగుపాటుతో రెండు పశువులు మృతి చెందాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అమ్మపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తిమ్మన్న తన ఆవు దూడలను పొలం వద్ద కట్టేసి ఉంచగా సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురవగా, పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాయి. పిడుగు పడి పశువులు కోల్పోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ గ్రామ నాయకుడు నాయకులు కృష్ణ అన్నారు.

దేవాలయం వద్ద కూలిన విద్యుత్ స్తంభం

అమరచింత, మే 23 : ఇటీవల కురిసిన వర్షానికి వనపర్తి జిల్లా అమరచింత మండలం కృష్ణం పల్లిలోని గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయం ముందు ఉన్న విద్యుత్ స్తంభం కూలి పడిపోయింది. మూడు రోజుల క్రితం కురిసిన చిన్న పాటి వర్షం గాలికి స్తంభం ఒరిగిపడడంతో ఆలయానికి వచ్చే భక్తులకు అంతరాయం కలు గుతోంది. స్తంభంతో పాటు ఆలయం ముం దున్న బోర్డు సైతం కిందికి పడిపోయింది. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆంజనేయస్వామి ఆలయం ముందు పడిపోయిన స్తంభం

వేసవి శిక్షణ..
చిన్నారుల సాధన

▸ బాస్కెట్ బాల్ సాధనతో కళకళలాడుతున్న కోర్టు ▸ ఉదయం, సాయంత్రం వేళ ప్రత్యేక శిక్షణ

▸ 100మందికి పైగా జాతీయ స్థాయిలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

▸ బాస్కెట్ బాల్ ప్రతిభతో సర్కార్ కొలువు సాధించిన క్రీడాకారులు



వేసవి బాస్కెట్ బాల్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారులు



స్టేడియంలో బాస్కెట్ బాల్ కోర్టులో శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 23 : జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియం మైదానంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేసవి సెలవులను పురస్కరించుకొని బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు, యువతకు నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుంది. శిబిరంలో 70మందికి పైగా చిన్నారులు, యువకులు శిక్షణ తీసుకుంటున్నారు. వీరిలో కొందరు చిన్నారులు బాస్కెట్‌బాల్ క్రీడా అంశాల్లో ఓనమాలు నేర్చుకుంటున్నారు. ఉదయం బాస్కెట్ బాల్ బేసిక్ నేర్పిస్తున్నారు. బాల్ పొజిషన్, డ్రిబ్లింగ్, పైటైప్, పాసెస్, షూటింగ్‌లలో శిక్షణ అందిస్తున్నారు. సాయంత్రం వేళల్లో డ్రిబ్లింగ్‌తో పాటు వన్‌టూ జంప్ స్టప్, క్విక్ స్టప్‌తో పాటు మ్యాచ్‌లో ఉండే నియమ, నిబంధనలను వివరిస్తున్నారు. వేసవి శిబిరాల్లో ఎంతో మంది క్రీడాకారులు వెలుగులో రావడంతో ఈ సారి కూడా నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించడానికి ప్రత్యేక శిబిరంలో శిక్షణపై దృష్టి సారించారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు

జిల్లాలో ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వేసవి శిబిరాల్లో వెలుగులోకి వచ్చారు. ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా జట్టుకు ఎంపిక చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలకు ప్రాతినిధ్యం వహించారు. 100 మందికి పైగా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. దాదాపు 20 మంది వివిధ శాఖల్లో బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఉద్యోగాలు సాధించారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదు. ఎంతో మంది బాస్కెట్ బాల్‌లో జాతీయ స్థాయిలో సత్తాచాటారు. క్రీడా కోటా ఉద్యోగాలు సాధించారు. ప్రతిభ గల క్రీడాకారులకు అసోసియేషన్ తరఫున సహకారం ఉంటుంది. క్రీడాశాఖ సహకారంతో వేసవి శిబిరం నిర్వహిస్తున్నాం.

- మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్, బాస్కెట్ బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు



వేసవి బాస్కెట్ బాల్ శిబిరాల్లో ఎంతో మంది ప్రతిభ గల క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. 2013 నుంచి కోచ్‌గా శిక్షణ ఇస్తున్నాను. 70మందికి పైగా చిన్నారులు, యువతకు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నాం. వేసవి శిబిరాల్లో ప్రతిభ చాటి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. మరి కొంత క్రీడాకారులు వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. ప్రతిభ గల క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికయ్యే అవకాశం ఉంది.

- మహ్మద్‌ఖలీల్, డీఎస్ఏ కోచ్

రాష్ట్ర జట్టుకు ఎంపికవటం సంతోషంగా ఉంది



ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన జాతీయస్థాయి అండర్-17 బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర బాలికల జట్టుకు ఎంపికవటం సంతోషంగా ఉంది. స్టేడియంలో గతంలో నిర్వహించిన వేసవి శిబిరాల్లో కోచ్ ఖలీల్ వద్ద ఓనమాలు నేర్చుకున్నాను. రోజూ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్నాను. ఇప్పటికి తొమ్మిది సార్లు రాష్ట్ర స్థాయి టోర్నీల్లో ఆడాను. భవిష్యత్తులో భారత జట్టుకు ఆడాలన్నదే నా లక్ష్యం. వేసవి శిబిరాలను బాస్కెట్‌బాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఎన్.హర్షిత, బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి, మహబూబ్‌నగర్

బాస్కెట్‌బాల్ అంటే ఇష్టం



బాస్కెట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం. వేసవిలో స్టేడియంలో బాస్కెట్ బాల్‌లో శిక్షణ ఇస్తున్నారని నాన్న ఇక్కడ చేర్పించారు. కోచ్ సార్ బాస్కెట్‌బాల్ అంటే ఏంటి, ఎలా ఆడాలి అనే అంశంపై చెబుతున్నారు. బాస్కెట్‌బాల్ క్రీడలో రాణిస్తాను.

- వి.హరిద్విత్, 1వ తరగతి, మహబూబ్‌నగర్

క్రీడాకారులు రంజీకి ఎంపిక కావాలి

▸ రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలి ▸ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్



అండర్-23 ఉమ్మడి జిల్లా జట్టుతో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 23 : క్రికెట్‌లో జిల్లా క్రీడాకారులు రంజీ జట్టుకు ఎంపిక కావాలని మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నుంచి హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ-టీ20 లీగ్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-23 జట్టును గురువారం ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ చాలా మంది క్రికెట్ ఆటను ఎంపిక చేసుకుంటారని, నచ్చిన క్రీడలో రాణిస్తూ ప్రతిభ చాటాలని క్రీడాకారులకు సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. రాష్ట్ర స్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీల్లో జిల్లా జట్టు చాంపియన్ నిలిచిందని, అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ నెల రోజులుగా నిర్వహించిన వేసవి శిబిరాల్లో ఎంతో మంది క్రీడాకారులు వెలుగులోకి వచ్చారని, ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం సభ్యులు సురేష్ కుమార్, కృష్ణమూర్తి కోచ్‌లు గోపాల కృష్ణ, అబ్దుల్లా, శ్రీను, నాయకుడు కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అండర్-23 బాలుర జట్టు

గణేశ్ (కెప్టెన్), అరుణ్ (వైస్ కెప్టెన్), హర్షవర్ధన్, శ్రీకాంత్, ఏ.డెవిడ్, ఖయ్యూం, అబ్దుల్ రఫీ, శ్రీకాంత్ యాదవ్, అనిల్, కె.శ్రీకాంత్, జయసింహ, అరవింద్, ముఖిత్, అద్నాన్, అభినవ్, బురాన్, శశాంక్, మనోజ్ జట్టు సభ్యులుగా ఉన్నారు.

ఫసల్ బీమాపై అవగాహన కల్పించాలి

▸ పీఎంఎఫ్‌బీవై బీమా ప్రీమియం ప్రభుత్వాలే చెల్లిస్తాయి

▸ అధికారులు బాధ్యతాయుతగా పని చేయాలి ▸ సమావేశంలో కలెక్టర్ రవినాయక్



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్ నగర్ (కలెక్టరేట్), మే 23 : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకంపై రైతులకు అవగాహన కల్పించాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రాంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతుల నియంత్రణలో లేకుండా ప్రకృతి వైపరీత్యాల వలన పంటనష్టం జరిగితే ఆర్థిక నష్టం జరగకుండా బీమా రైతులకు ప్రయోజనకరంగా, రిస్క్ కవరేజీ కల్పిస్తుందని, ఈ విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం వానాకాలం సీజన్ నుంచి తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. వచ్చే వానాకాలం నుంచి తెలంగాణ ప్రభుత్వం తిరిగి పి.ఎం. ఫసల్ బీమా యోజనలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పంట నష్టం గ్రామాల వారీగా పంటల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఫసల్ బీమా యోజన పథకం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, పంట నష్టం జరిగినప్పుడు దీని ద్వారా పరిహారం అందుతుందని తెలిపారు. రైతులు బీమా చెల్లించే అవసరం లేదని, ప్రీమియంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లిస్తాయని తెలిపారు. అధికారులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా కృషి చేయాలని కోరారు. ఫసల్ బీమా పథకంలో మార్గదర్శకాల మేరకు గ్రామం, మండలం యూనిట్‌గా పరిగణిస్తారని చెప్పారు. పంట దిగుబడి ఆధారంగా, వాతావరణ పరిస్థితుల అనుగుణంగా బీమా నిర్ణయిస్తారని తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సూచనలు అందజేయాలని అన్నారు. మహబూబ్ నగర్ రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి మాస్టర్ ట్రైనర్ కృపాకర్ రెడ్డి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిపించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన పరిశీలకులు జేడీ శైలజ ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన కార్యక్రమం రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫసల్ బీమా యోజనపై సమర్థవంతంగా అమలుకు ఈ అవగాహన కార్యక్రమంలో అధికారులు, రైతులు, శాస్త్రవేత్తల నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం ఏడీ శ్రీదేవి, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, వ్యవవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర దర్శనానికి వెళ్లివస్తుండగా ఆటో బోల్తా

▸ పలువురికి గాయాలు



కొండ దిగువన బోల్తాపడ్డ ఆటో

అచ్చంపేటటౌన్, మే 23: ఉమామహేశ్వర స్వామి దర్శనం కోసం వెళ్లి అనంతరం తిరుగు ప్రయాణంలో వస్తుండగా కొండ దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడ్డడంతో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అచ్చంపేట మండల పరిధిలోని పుల్జాల, ఉప్పునుంతల మండల పరిధిలోని తాడూరు గ్రామాలకు చెందిన పలువురు గురువారం ఉమామహేశ్వరంలో ఈశ్వరుని దర్శనం కోసం వెళ్లారు. దర్శనం అనంతరం కొండ దిగుతుండగా ఆటో అదుపుతప్పడంతో కొండ దిగువకు జారిపడింది. దీంతో ఆటోలో ఉన్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్ 108కి ఫోన్ చేయగా, అంబులెన్స్‌లో గాయాలైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

వెంచర్ భూమిని పరిశీలించిన ఆర్డీవో



118 సర్వే నెంబర్‌లోని వెంచర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో నవీన్‌కుమార్

బాలానగర్, మే 23 : బాలానగర్ మండల కేంద్రంలోని 118 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన వెంచర్‌ను గురువారం మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పరిశీలించారు. సర్వే నెంబర్ 118/వన్ 15 ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ ఏర్పాటు చేయడానికి వరాహి అనే వెంచర్ సంస్థ పనులు ప్రారంభించింది. రియల్ సంస్థ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా భూమి పొందిందని, అందులో ఉన్న నీటి కాలువ అలుగు పారే వరద కాలువ పూడ్చి వేసిందని, పాటు కాలువ దారి మళ్లించిందని ఆరోపణలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కొన్నాళ్ల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఈ మేరకు స్థానిక రైతుల అభిప్రాయాలు, వెంచర్ యాజమాన్యం అభిప్రాయాలు పరిశీలించారు. పూర్తి స్థాయిలో సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆర్డీవో వెల్లడించారు. కార్యక్రమంలో ల్యాండ్ సర్వే ఏడీ కిషన్, మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్, మైనింగ్ జేడీ నరసింహారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా నదిలో మహిళ శవం లభ్యం

కృష్ణ, మే 23 : నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని కృష్ణానదిలో ఓ మహిళ శవం లభ్యమైంది. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఉదయం కృష్ణా నదిలో స్నానాలు చేయడానికి వెళ్లిన యువకులు నదిలో గుర్తు మహిళ శవాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ఎస్ఐ నవీద్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దుకాణ రశీదు, వెంట ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మక్తల్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన సులోచనమ్మ (40) అని నిర్ధారణ చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం..

లింగాల, మే 23 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అంబటిపల్లి శివారులో మహిళ మృతదేహం బావిలో లభ్యమైన సంఘటన గురువారం తీవ్ర కలకలం రేపింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అంబటిపల్లి గ్రామానికి చెందిన పార్వతమ్మ(42) వనపర్తి జిల్లా రేవల్లి గ్రామానికి చెందిన ఆనంద్‌తో 20ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమెకు సంతానం లేకపోవడంతో ఆమె భర్త భాగ్యలక్ష్మి రెండవ వివాహం చేసుకున్నాడు. గత ఐదేళ్ల క్రితం ఆనంద్ మరణించడంతో అతని ఇద్దరు భార్యలు తరచుగా ఆస్తి పంపకాలపై గొడవ పడుతుండేవారు. అందులో భాగంగానే ఈనెల నాల్గవ తేదీన ఆనంద్ రెండవ భార్యతో గొడవ పడిన పార్వతమ్మ అంబటిపల్లి పుట్టింటికి వచ్చింది. తన సవతితో ఇల్లు వివాదంలో ఉందని, తనకు ఇల్లు కట్టించి ఇవ్వమని అన్నను కోరింది. తనకు కొంత సమయం కావాలని అన్న బదులు ఇవ్వడంతో.. తనను చూసుకునే వారు ఎవరూ లేరని ఇంటి నుంచి వెళ్లిపోయింది. తరచుగా గొడవ పడి రేవల్లి నుంచి పుట్టింటికి రావడం, తన అన్నతో కూడా గొడవ పడి వెళ్లడం జరుగుతుండేది. గ్రామ శివారులోని యాపట్లకు వెళ్లే మార్గాన గల పొలంలోని బావిలో ఎప్పటి మాదిరిగానే ఈత కొట్టడానికి వెళ్లిన వారికి ఆమె మృతదేహం నీళ్లలో తేలియాడుతూ కన్పించింది. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి పంచనామా నిర్వహించారు. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కల్వకుర్తి, మే 23 : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం వెంకటాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.... వెంకటాపూర్ గ్రామానికి చెందిన రాజావర్ధన్‌రెడ్డి ఎద్దు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.75 వేల వరకు ఉంటుందని బాధిత రైతు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

అలంపూర్ చౌరస్తా, మే 23 : జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామానికి చెందిన యువతి కన్పించకుండా పోయినట్లు ఉండవల్లి ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మద్దిలేటి దంపతుల కుమార్తె భార్గవి(20) అలంపూర్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలీయర్ చదువుతోంది. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. గత బుధవారం ఉదయం ఆమె తల్లిదండ్రులు సమీపంలోని ఆలయానికి వెళ్లారు. వారు ఇంటికి తిరిగి వచ్చేసరికి కుమార్తె కన్పించలేదు. ఇరుగు పొరుగు వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో వారు ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తెలిపారు.

వెంచర్ ఆర్చీ పనుల నిలుపుదల

బాలానగర్, మే 23 : మండలంలోని చెన్నంగులగడ్డ గ్రామపంచాయతీ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ రైస్ విల్లా వెంచర్ యాజమాన్యం తమ వెంచర్ ముఖద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చీ నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో తదితర అధికారులు నిలిపివేశారు. నిబంధనలను తుంగలో తొక్కి ఆర్చీ నిర్మాణ పనులు చేపడుతున్నారని, తద్వారా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ప్రజలు ఆరోపించడంతో అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించి, పనులను నిలిపివేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రేవల్లి, మే 23 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా రేవల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన బోయ బొగ్గు బాలపీరు(36) ఈనెల 19న మున్న నూరు గ్రామంలోని తమ బంధువుల ఇంట్లో ఓ శుభకార్యానికి గాను బైక్‌పై బ యలుదేరాడు. అదేరోజు సాయంత్రం సమయంలో తిరిగి గ్రామానికి వస్తుండగా కేశంపేట శివారులో బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు మహబూబ్‌నగర్‌కు తరలించగా మూడు రోజుల చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో బుధవారం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య బాలీశ్వరి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు. గ్రామ మాజీ సర్పంచ్ సునీల్‌కుమార్ వారి యూత్ తరఫున రూ.30వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సీతారామారావు

చారకొండ, మే 23: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు వరి ధాన్యాన్ని విక్రయించాలని అడిషనల్ కలెక్టర్ సీతారామారావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం, మండలంలోని జూపల్లిలో రైతువేదికలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామికుమార్, తహసీల్దార్ కేసీ ప్రమీలతో కలిసి అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిని దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు వరి తీసుకొచ్చేటప్పుడు తాలు, గడ్డిపోసలు లేకుండా జాగ్రత్తలు పాటించి తేమశాతం ఉండే విధంగా తీసుకురావాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ధాన్యానికి సంబంధించిన రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయరాదని అధికారులకు సూచించారు. క్వింటాలు వరికి ప్రభుత్వం రూ. 2,203 గిట్టుబాటు ధర కల్పిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆర్ఐ మహమ్మద్ నబి, పీఏసీఎస్ సీఈవో వెంకటయ్య భీమయ్యగౌడ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

కోడేరు, మే 23 : మండల కేంద్రంతోపాటు ఎత్తం, కొండ్రావుపల్లి, నర్సాయిపల్లి, నాగులపల్లి, మైలారం తదితర గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను మండల తహసీల్దార్ విజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లను మీటరు ద్వారా తేమ శాతాన్ని పరిశీలించారు. రైతులు తమ తమ వడ్లను 14శాతం తేమ ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిర్దావర్ జంబులయ్య, రైతులు, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: రైతులు పండించిన వరి కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దకొత్తపల్లి తహసీల్దార్ ఎండీ.యూసుఫ్ అలీ అన్నారు. గురువారం మండల పరిధిలోని చంద్రకల్, ముష్టిపల్లి, నక్కలపల్లి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సింగిల్ విండో సీఈవో సిరాజ్ తదితరులు ఉన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వంగూరు, మే 23: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులను కల్యాణ మండపంపై ప్రతిష్ఠించారు. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ మంగళ వాయిద్యాలు మోగుతుండగా భక్తుల హర్షధ్వానాల నడుమ స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ వేడుకలను తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజన్న పాల్గొన్నారు.

నేడు ప్రాంతీయ పరిశోధన కేంద్రంలో విత్తన మేళా

బిజినేపల్లి, మే 23 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని పాలెంలోని దక్షిణ తెలంగాణ ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శుక్రవారం విత్తన మేళా నిర్వహిస్తున్నట్లు ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి గురువారం తెలిపారు. విత్తన మేళాలో ఈ ప్రాంత నేలలకు, వాతావరణ పరిస్థితులకు అనువైన నాణ్యమైన అధిక దిగుబడులను ఇచ్చే విత్తన రకాలను ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఎక్కువ సంఖ్యలో హాజరై తమకు అవసరమైన పంట రకం విత్తనాలు తీసుకోవడంతో పాటు ఆ పంట సాగు, యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, సందేహాలను సంబంధిత వ్యవసాయ శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకొని వ్యవసాయంలో అధిక లాభాలు ఆర్జించాలని ఆయన సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు విత్తన మేళా కొనసాగుతందన్నారు.

బాల్యమిత్రుని కుటుంబానికి స్నేహితుల చేయూత

వెల్దండ, మే 23 : అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్ కుటుంబానికి ఆయన చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. జడ్పీహెచ్‌ఎస్ కల్వకుర్తిలో 2003 - 04 పదవతరగతి బ్యాచ్‌కు చెందిన యువకులు తమ స్నేహితుడు గోవర్ధన్ అకాల మరణం చెందడంతో తమ వంతుగా 17,500 రూపాయలు, క్వింటాలు బియ్యం సమకూర్చి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈదులపల్లి శ్రీనివాసులు ఉన్నారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఊర్కొండ, మే 23: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదినం పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు పూలబొకే అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గోపాల్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కైసర్ నాయకులు నర్సిరెడ్డి, మనోహర్ రెడ్డి, వహీద, రాజేష్, శ్రీశైలం, మధు, మాసుం, ఆంజనేయులు ఉన్నారు.

యూనిఫాం క్లాత్ అందజేసిన ఎంఈవో

తెలకపల్లి, మే 23 : మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో గురువారం మండల విద్యాధికారి చంద్రుడు అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మహిళా సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టేందుకు ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు, ప్రతినిధులతో మాట్లాడి తీర్మానం చేశారు. ఇట్టి ఏకరూప దుస్తులను విద్యా సంవత్సరం పాఠశాలలు పునఃప్రారంభమైన నాటికి అన్ని పాఠశాలల విద్యార్థులకు అందించాలని మండల విద్యాధికారి చంద్రుడు సూచించారు. మండల విద్యాధికారి చంద్రుడు, కాంప్లెక్స్ ఉపాధ్యాయురాలు బాలస్వామి, మల్లికార్జున్, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు నిరంజన్, మహిళా సంఘాల అధ్యక్షుడు, మండల విద్యావనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పౌర్ణమి గోపూజ, రుద్రాభిషేకం

కందనూలు, మే 23 : జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీలో గల పబ్బతి అంజనేయస్వామి ఆలయ ఆవరణలో గురువారం వైశాఖ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని సామూహిక గోపూజను శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మాడభూషి అజయ్‌కుమార్ శర్మన్ తెలిపారు. అర్చకులు కందాడై శ్రీనివాసాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోరు మోటార్ల వైర్లు చోరీ

వంగూరు, మే 23: మండలంలోని తిప్పారెడ్డిపల్లిలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించి వైర్లను కట్ చేసుకొని దొంగిలించక వెళ్లారు. 30 బోరు మోటార్ల వద్ద వైర్లను దుండగులు కట్ చేసుకొని వెళ్లారని రైతులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ లో వారు ఫిర్యాదు చేశారు.

ఈ ఘటనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దుండగులను పోలీస్‌లు వెంటనే పట్టుకొని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

ప్రత్యేకాధికారుల పాలన ఎక్కడ?

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా మురుగు కాల్వలు
- పగలే వెలుగుతున్న వీధి దీపాలు

బల్మూరు, మే 23: గ్రామీణ ప్రాంతాలే దేశానికి పట్టుకొమ్మలనే సూక్తిని పాటించే ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి మాకేమి తెలియదన్నట్లుగా నిశ్శబ్ద పద్ధతిలో ఉండిపోవడంతో గ్రామాల్లో డ్రైనేజీలు మురికి కంపు కొడుతూ ప్రజలకు హాని కల్పించే విధంగా మారాయి. బల్మూరు మండల కేంద్రంలోని ఎక్కడి కాలనీల్లో అక్కడ డ్రైనేజీ కాల్వలు నిండి మట్టితో కూరుకుపోయాయి. మురుగు నీరు రోడ్లపై పారుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారే పరిస్థితి నెలకొన్నది. నాడు సర్పంచ్‌లు ఉన్నప్పుడు అప్పుడప్పుడు వారు పరిసరాలను శుభ్రపర్చే విధంగా చర్యలు తీసుకునే వారు. నేడు సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసింది. వారి ద్వారా గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించే విధంగా పంచాయతీ కార్యదర్శులను పెట్టి సిబ్బందితో పని చేయించాలని సంకల్పించింది. ప్రత్యేకాధికారులు మొదట్లో హడావిడి చేసినప్పటికీ తర్వాత కాలంలో పార్లమెంట్ ఎన్నికలు రావడం, ఆ తర్వాత మళ్లీ అధికారుల జాడ కనిపించలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే మురుగున పడిపోయాయి. గ్రామాల్లో రాత్రివేళల్లో కొన్ని వీధి దీపాలు లేకుంటే మరికొన్ని కాలనీల్లో పగలే దీపాలు వెలుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు లేకపోవడంపై గ్రామ యువకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు దృష్టి సారించి డ్రైనేజీలను శుభ్రపర్చి సమస్యను పరిష్కరించాలని బల్మూరు గ్రామ ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

సమస్యలు పరిష్కరించడంలో కార్యదర్శి అలసత్వం

గ్రామ సమస్యలపై పలుమార్లు పంచాయతీ కార్యదర్శి విన్నవించినా స్పందన ఇవ్వకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయినా పంచాయతీ కార్యదర్శి పనితీరు మారలేదు. ప్రత్యేక అధికారులు కన్పించడం లేదు.

-చాంద్‌పాషా, బల్మూరు



పోడు రైతులందరికీ భూమి హక్కు పత్రాలు

- ఖరీఫ్‌లో పోడు భూముల్లో వ్యవసాయానికి అటవీ శాఖ ఆటంకం కల్గించొద్దు
- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్, మే 23: పోడు వ్యవసాయం చేసే రైతులందరికీ భూమి హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని, త్వరలోనే పోడు వ్యవసాయదారులందరికీ శాశ్వత భూమి హక్కు పత్రాలు పంపిణీ చేయనున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలిపారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, పదర, లింగాల, బల్మూరు మండలాల్లో పోడు భూముల సమస్య తీవ్రంగా ఉందని, ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టనుందన్నారు. ఖరీఫ్ సీజన్ లో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులందరూ తమ పొలాల్లో విత్తనాలు వేసుకొని పంటలు సాగుచేసుకునేలా అటవీశాఖ క్షేత్ర సంచాలకులు, డీఎఫ్‌వోలతో మాట్లాడానన్నారు.

తాజాగా బుధవారం తనను కలిసి మాచారం గ్రామ చెంచు రైతులకు పోడు భూముల్లో వ్యవసాయ పనులు చేసుకునేలా అనుమతి ఇప్పించామన్నారు. గతంలో సాగు చేసుకున్న భూములు కాకుండా కొత్తగా అడవిలో చెట్లు నరికి భూమి సాగు చేసుకుంటే ప్రభుత్వం ఉపేక్షించబోదని, అట్టి వారిపై అటవీ చట్టాలనుపయోగించి ప్రభుత్వమే కేసులు నమోదు చేస్తుందన్నారు. అమ్రాబాద్ లిఫ్ట్ ఇరిగేషన్ మొదటి ఫేజ్ పనులు మొదలు పెట్టేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులతో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. కెపాసిటీ తక్కువ చేసి రీడిజైన్ చేసి రైతులు ఎక్కువగా భూములు కోల్పోకుండా చూస్తామని 15 రోజుల్లో రిజర్వాయ ర్, కెనాల్ పనులను మొదలు పెడతామని చెప్పారు. మరో ఆరు మాసాల్లో రెండో ఫేజ్ పనులు చేపట్టనున్న ట్లు చెప్పారు. వేసవిలో నియోజవర్గంలో తాగునీటి సరఫరాకు రూ.5 కోట్లు నిధులు మంజూరు చేయించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు. ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను సరఫరా చేసేలా వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించినట్లు, ఖల్తీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసే వ్యాపారులపై పీడీ ఆక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. నియోజకవర్గంలో విద్య వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సరఫరా, టాయిలెట్ల ఏర్పాటు చేస్తామన్నారు. అచ్చంపేట ఏరియా ఆసుపత్రితో పాటుగా మండలాల్లోని ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ నెల 5, 6వ తేదీలలో అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో నిర్వహించే ఉచిత శస్త్ర చికిత్స శిబిరంలో 24 రకాల ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే 100 మంది రోగులు ఆపరేషన్ల కోసం రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, నిరుపేదలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం, డీసీసీ కార్యదర్శి సంభు వెంకట్ రమణ, కాంగ్రెస్ నాయకులు పెర్ముల వెంకటేశ్వర్లు, జూలూరి సత్యనారాయణ, పంబలి బుచ్చయ్య, శివాజీ, రహిమాన్, మేరాజ్, రమణగౌడ్, హతీరాం, రాజేంద్ర ప్రసాద్, రాజారాం, జహార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ మంజూరు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 23: కల్వకుర్తి ప్రాంతానికి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని మంజూరు చేయాలని, ఈ ప్రాంత అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించాలని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరడం జరిగిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో గురువారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ప్రాంతంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కావాల్సిన నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గంలో చేసే అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ మంజూరు చేయాలని తాను కోరడంతో సానుకూలంగా స్పందించారని అందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సీఎం సూచించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధిపర్చడం జరుగుతుందని, సంక్షేమం, అభివృద్ధి పథకాలను అర్హులందరికీ అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎంను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకుడు సురభి వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

చదువుతో పాటు క్రీడలు, కళలు నేర్పించాలి

తెలకపల్లి, మే 23 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, కళలు ఎంతో అవసరమని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక శివగంగా ఫంక్షన్ హాల్‌లో వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. శృతిలయ అకాడమీ వారు నెలరోజుల పాటు వివిధ మండలాల, గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులకు నృత్యాలతో పాటు మ్యాథమెటిక్స్, యోగా, తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం తదితర అంశాలు నేర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ వందేమాతరం ఫౌండేషన్, శృతిలయ అకాడమీ వాళ్లు ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని, ఇలాంటి కార్యక్రమాలు ఇంకా కొనసాగించాలని ఆయన అన్నారు. విద్యార్థులలో విదేశీ వ్యామోహంలో పడి మన భారతీయ మూలాలు, సంస్కృతీ సాంప్రదాయాలు మరిచిపోతున్నారని వాటన్నింటికీ ఈ సంస్థ ద్వారా వెలికితీయడం ఎంతో సముచితమన్నారు. అనంతరం వందేమాతరం ఫౌండేషన్ నాయకుడు జగన్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేసిన శాస్త్రీయ, జానపద నృత్యాలను విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ నరేష్, సీఎల్ఆర్ కళాశాల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, సీఎల్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి, నిర్వాహకులు చిత్తరంజన్‌దాస్, సుల్తాన్, రజిత, రాజు, చారి పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

కొనసాగుతున్న ఉత్సవాలు

వెల్దండ, మే 23 : మండల పరిధిలోని బైరాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా అభిషేకం, పూర్ణాహుతి, నిత్యహోమం వంటి కార్యక్రమాలు కనులపండువగా జరుపుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసిన కాంగ్రెస్ నాయకులు

చారకొండ, మే 23: కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణను కలిశారు. మర్రిపల్లిలో నెలకొన్న సమస్యలను వారు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లునాయకులు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండల్, ఉపాధ్యక్షుడు విష్ణు, గ్రామ కమిటీ ఇంచార్జి రాజునాయక్, నూనేరాజు, అంగోత్ లాలునాయక్, వరికుప్పల మల్లేష్, బాలకృష్ణ తదితరులున్నారు.

పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలి

మన్ననూర్, మే 23: అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు అంబేడ్కర్ కాలనీలో శిథిలావస్థ దశలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించాలని కాలనీ వాసులు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు విన్నవించారు. గురువారం మన్ననూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు బాలమ్మ ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిసి సమస్యను విన్నవించారు. 1 నుంచి 5వ తరగతి వరకు గల పాఠశాలలో విద్యార్థులకు ఒకే గది ఉండడంతో అసౌకర్యంగా ఉందని, అధునాతన వసతులతో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ రూ.40 లక్షలతో మూడు గదుల్లో కొత్త పాఠశాల భవనం నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు రవికుమార్, పెర్ముల బాలస్వామి, వెంకటేశ్వర్లు, మధు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

కల్వకుర్తి, మే 23 : అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న వాహనాన్ని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు... కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ జే వెంకటొరెడ్డి కథనం ప్రకారం... కల్వకుర్తి మండలం తర్నికల్‌కు చెందిన జగన్ కర్ణాటకలోని బీదర్ నుంచి 70 బ్యాగుల నల్లబెల్లం(2100 కేజీలు), పటిక 30కేజీలను వాహనంలో తరలిస్తుండగా కల్వకుర్తి శివారులోని కొట్ర గేటు వద్ద వాహనాల తనిఖీలో ఎస్‌టీఎఫ్ టీమ్, కల్వకుర్తి ఎక్సైజ్ అధికారులు గుర్తించడం జరిగిందని సీఐ తెలిపారు. డిండి మండలం చెరుకుపల్లికి చెందిన కృష్ణ, అమ్రాబాద్‌కు చెందిన రవి టాటా ఏసీ, ట్రాలీ ఆటోలో తర్నికల్‌కు చెందిన జగన్ కోసం తీసుకొస్తున్నామని తెలపడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని, నల్లబెల్లం, పటికను స్వాధీనం పర్చుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా వంగూరు మండలం కిష్టంపల్లితండాలో జరిపిన దాడుల్లో 19లీటర్ల సారాను స్వాధీనపర్చుకుని ఇద్దరిపై కేసు నమోదు చేయడంతోపాటు ఒక టీవీఎక్స్‌ఎల్ వాహనాన్ని సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ దాడులను మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ఎక్సైజ్ అధికారిణి గాయత్రిల ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు, రూట్‌వాచ్‌లు నిర్వహించామని సీఐ పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

వంగూరు, మే 23: మండలంలోని డిండిచింతపల్లిలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వారు వైద్య సేవలు పొందారు. శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై, ఇందుర్తి కుటుంబం వారి ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో కంటి శుక్లం శాస్త్ర చికిత్సలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అక్కడే అపరేషన్లు చేశారు. ఆర్‌అండ్‌బి నేషనల్‌హై చీఫ్ గణపతిరెడ్డి, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల చెన్నై చైర్మన్ బాలకిష్టారెడ్డి, జేకే రావు పర్యవేక్షించారు. నారాయణరెడ్డి, రాజేందర్‌రెడ్డి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

బుద్ధగీతం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నెలపొడుపు సాహిత్య వేదిక సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 23: మండల పరిధిలోని వనపట్ల గ్రామంలో నెలపొడుపు సాహిత్య వేదిక ఆధ్వర్యంలో బుద్ధగీతం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పట్వారీల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్దుని బోధనలు శాంతికి చిహ్నాలన్నారు. సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మన్యపురెడ్డి, దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, చిత్తనూరు శ్రీనివాసులు, భూషపాగ రాములు, సుదర్శన్, నెలపొడుపు సాహిత్య వేదిక అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి వహీద్‌ఖాన్, ఎదిరేపల్లి కాశన్న, వెన్నెల సాహిత్య అకాడమీ అధ్యక్షుడు ముచ్చర్ల దినకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి

కల్వకుర్తిటౌన్, మే 23: బీఆర్ఎస్ నాయకులపై దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి హత్య రాజకీయంగా ఎదుర్కొనలేకనే ఇలా చేస్తున్నారని అన్నారు. ఈ హత్యవెనక ఉన్న పెద్దనాయకులను గుర్తించి శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు మరోమారు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



బుద్ధ జయంతి వేడుకలు జరుపుకున్న విద్యార్థులు

అచ్చంపేటటౌన్, మే 23: గౌతమి బుద్ధుని జయంతి వేడుకలు గురువారం పట్టణంలోని ఉచిత కోచింగ్ సెంటర్ ఉపాధ్యాయుడు గాజుల వెంకటేష్ విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ మహనీయులు బుద్ధుడు, బోధిసత్వ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్ఫూర్తితో విద్యార్థులకు విద్యను బోధిస్తున్నామన్నారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● నాగరకర్నూల్ టౌన్: గౌతమ బుద్ధుని జయంతిని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బుద్ధుడి చిత్ర పటానికి మిషన్ అధ్యక్షుడు తలారి మద్దిలేటి పూల మాల వేసి నివాళులు అర్పించారు. మిషన్ సభ్యులు మల్లికార్జున్, రాములు, మద్దిలేటి, కోవర్దన్, వెంకటస్వామి, సాయిబాబు, జ్ఞానేశ్వర్, క్రాంతి, వినోద్, రవి, శ్యాంమ్, రాములు, కృష్ణప్రసాద్, రామకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కాంగ్రెస్ కార్యకర్త మృతి

- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



వెంకటయ్య పార్థివ దేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న వంశీకృష

అమ్రాబాద్, మే 23: పదర మండల కేంద్రానికి చెందిన పుణ్యమూర్తి వెంకటయ్య(48) కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వెంకటయ్య పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి కాంగ్రెస్ పార్టీ పరంగా అండగా ఉంటామని వారిని ఓదార్చారు. పదర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రామలింగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ రమేష్, కాంగ్రెస్ నాయకులు అలరాజు, గోలి వెంకటయ్య ఉన్నారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలోని ఉమామహేశ్వర తండాలో వ్యవసాయ పనులు చేస్తుండగా తేనె టీగలు దాడి చేసిన ఘటనలో 10 రోజుల క్రితం మృతి చెందిన తారక్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వంశీకృష్ణ గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు హతీరాం, చంద్రు బావోజీ, రమేష్, శంకర్, రాజారాం, గోపాల్, సుక్య, సంభు వెంకట్‌రమణ, బుచ్చయ్య, జూలూరి సత్యనారాయణ, రమణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గీత కార్మికుడి మృతి

బిజినేపల్లి, మే 23 : మండలంలోని కారుకొండ గ్రామంలో బుధవారం రాత్రి లక్ష్మయ్య గౌడ్ (60) అనే గీత కార్మికుడు గుండెపోటుతో చనిపోయాడని గురవారం కుటుంబీకులు తెలిపారు. గ్రామంలో కల్లు గీత కార్మికుడిగా పనిచేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్న లక్ష్మయ్య గౌడ్ అకాల మరణంతో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

వివిధ శాఖల పనితీరుపై వివరాలు సేకరించిన ఏఎస్‌వోలు

తెలకపల్లి, మే 23 : కేంద్ర సర్వీసుల ఏఎస్‌వోల బృందం నాల్గవ రోజు గురువారం గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ, అసిస్టెంట్ ఇంజనీర్లతో వారి శాఖల పనితీరుపై వివరాలు సేకరించారు. చౌకధర దుకాణాన్ని సందర్శించి డీలర్ ద్వారా నిత్యావసర సరుకుల సరఫరా గురించి వివరాలు సేకరించారు. తర్వాత కామన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించి ప్రజలకు ఏ విధంగా ఈ సెంటర్ ఉపయోగపడుతుందో అనే సమాచారాన్ని సేకరించారు. కొందరు గ్రామ మహిళలు, రైతులతో మాట్లాడి వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో కృష్ణయ్య, ఈవో భాస్కర్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తిటౌన్, మే 23: పురపాలిక పరిధిలోని గురువారం హనుమాన్‌నగర్, ఇందిరానగర్ కాలనికి చెంది రాజు, రాములు అనారోగ్యంతో మృతి చెందినట్లు ఆయా కుటుంబాల సభ్యులు తెలపారు. విషయాన్ని తెలుసుకున్న పురపాలిక చైర్మన్ ఎడ్మ సత్యం స్పందించి బాధిత కుటుంబాలకు పరామర్శించి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా ఒక్కో కుటుంబానికి తక్షణసాయం కింద రూ.5వేలు అందజేశారు. మాజీ చైర్మన్ శ్రీశైలం, నాయకులు బీమయ్య, సూరి, మల్లేష్, శ్రీను, వెంకటయ్య యాదయ్య, ఎల్లయ్య ఉన్నారు.

ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు



చెట్టునీడకు చేరిన గొర్రెల మంద

అచ్చంపేట, మే 23: రాష్ట్ర వ్యాప్తంగా గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఒక్కసారిగా వాతవరణం చల్లబడింది. గత 3 రోజులుగా వర్షాలు వెనకడుగు వేయడంతో మళ్లీ ఎండలు ముదురుతున్నాయి. 30 డిగ్రీలకు తక్కువగా నమోదు అయిన ఉష్ణోగ్రతలు గత రెండు రోజులుగా 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాయి. గురువారం 37 డిగ్రీలుగా నమోదైంది. రుతుపవనాలు జూన్ మొదటి వారం వరకు ప్రవేశించవచ్చునన్న వాతవరణ శాఖ అంచనాలతో ప్రజలు కొంత వరకు వేచిచూడకతప్పదు. వ్యవసాయానికి రైతులు అన్నీ సిద్ధం చేసుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

బీపీ పరీక్షలు చేయించుకోవాలి

పెద్దకొత్తపల్లి, మే 23 : 40సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరు బీపీ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. హైపవర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లిలోని మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర శిబిరం ఏర్పాటు చేసి బీపీ పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, ల్యాబ్‌టెక్నీషియన్ లక్ష్మీనరసింహగౌడ్, సూపర్‌వైజర్ బాలాజీసింగ్, వైద్య సిబ్బంది మల్లికార్జున్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.